

ఆచంటలో సభా స్థలం వద్ద పరిశీలిస్తున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

సమరానికి సై

ఆచంటలో రేపు చంద్రబాబు సభ

ఎన్నికలకు ఇక్కడి నుంచే శంఖారావం
విస్తృత ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు
లక్ష మంది వస్తారని అంచనా

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం ఎన్నికల సమరానికి సై అంటోంది. జిల్లాలో టీడీపీ శ్రేణులు జోష్‌తో ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనను దిగ్విజయం చేసి సత్తా చాటాలని నాయకులు, కార్యకర్తలు కసితో ఉన్నారు. ఆచంటలో జనవరి 7 ఆదివారం నిర్వహించే బహిరంగ సభకు లక్షమంది హాజరుకానున్నారని అంచనా వేస్తున్నారు. ఎన్నికల సభలా నిర్వహించాలని కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివెళ్లనున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ఆ బాధ్యతలు తీసుకున్నారు. ఆచంట నియోజకవర్గం నుంచే 40 వేల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రచించారు.పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ దీన్ని సవాల్‌గా తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా ముఖ్యనేతలతో ఆచంటలో సమీక్ష నిర్వహించారు. ప్రతి నియోజకవర్గం నుంచి సభకు రావాల్సిన జనంపై దిశానిర్దేశం చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు బహిరంగ సభకు పరిశీలకుడిగా ఉన్నారు. ప్రతి నియోజకవర్గానికి పరిశీలకులను నియమించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో కలిసి పరిశీలకులు గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. ప్రైవేటు బస్సులు, కార్లు, వాహనాలతో సభకు తరలి వెళ్లేలా ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. ఆచంట నియోజకవర్గంలో సభ ఏర్పాటు చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీ బీసీలకు ప్రాధాన్యం ఇస్తోందన్న సంకేతాలు పంపనుంది. గతంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువగళం పాదయాత్ర జిల్లాలో ఉండి, భీమవరం, నర్సాపురం, పాలకొల్లులో సాగింది. చంద్రబాబు బస్సు యాత్ర తాడేపల్లిగూడెంలో నిర్వహించారు. ఈసారి చంద్రబాబు బహిరంగ సభకు ఆచంటను వ్యూహాత్మకంగా ఎన్నుకున్నారు.

అధికార అడ్డంకులను ఎదుర్కొని ...

చంద్రబాబు సభను అడ్డుకునేందుకు అధికార పార్టీ అన్ని ప్రయత్నాలు చేసింది. సభా వేదిక లేకుండా చేయాలని కుట్రలు పన్నింది. ఆచంటలో 9 ఎకరాల లేఅవుట్‌లో చంద్రబాబు భారీ బహిరంగ సభకు తెలుగుదేశం ప్రణాళిక రచించింది. ఆ లేఅవుట్ యజమానికి అధికార పార్టీ నేతలు హెచ్చరికలు జారీచేశారు. అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికార పార్టీ కుతంత్రాలను పసిగట్టిన తెలుగుదేశం నాయకులు అప్రమత్తమయ్యారు. అదే లేఅవుట్‌లో సభ ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. చివరకు అక్కడే బహిరంగ సభ ఖరారైంది. అధికార పార్టీ చేష్టలపై విమర్శలు వెల్లువెత్తాయి. రాజకీయ సభలను అడ్డుకోవడానికి ప్రయత్నించే సంస్కృతికి జిల్లాలో తెరలేపుతున్నారన్న అపవాదు అధికార పార్టీపై పడింది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశంలో జోష్ ఏర్పడింది. తెలుగుదేశం, జనసేన నాయకులు గ్రామ స్థాయిలో చర్చలు జరుపుతున్నారు. చంద్రబాబు సభకు భారీగా జనాలను తరలించేలా చర్యలు చేపట్టారు.



ఆచంటలో సభ జరిగే ప్రాంతం వద్ద ఏర్పాట్లు

సభ విజయవంతం చేద్దాం : పితాని 7

కేరాఫ్ భీమవరం





సంక్రాంతి పందేలకు పెద్ద సంఖ్యలో అతిథులు
లాడ్జిలు, హోటళ్లు ముందుగానే ఫుల్
వసతి కోసం రాజకీయ సిఫార్సులు..పోలీసుల ఒత్తిళ్లు
కొత్తగా విడిది గృహాలు ప్రారంభం

భీమవరం, జనవరి 5 : సంకురాత్రి పండుగకు మరో 10 రోజులే ఉంది.. సెలవులు ప్రారంభ మైతే సొంత ఊర్లకు ప్రయాణాలు ఆరంభిస్తారు. ఏడాదికోసారైనా ఇలా సంక్రాంతి పేరుతో సొంత ఊర్లకు వచ్చే వారు, వారితో పాటు స్నేహితుల రాకతో గ్రామాలు కళకళలాడతాయి. సంక్రాంతికి నిండుదనం తెచ్చే గోదావరి జిల్లాలకు వచ్చే వారి సంఖ్య ఏటా క్రమంగా పెరుగు తోంది. ప్రత్యేకించి భీమవరంతో పాటు పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు భారీగా నిర్వహిస్తుంటారు. ఇక్కడకు హైదరాబాద్, బెంగళూరు ఇతన నగరాల నుంచి కూడా వస్తుంటారు. వీరందరికీ వసతి కావాలంటే భీమవరం కేరాఫ్‌గా మారింది. అందుకే సంక్రాంతికి నెలరోజుల ముందునుంచే భీమవరంలోని లాడ్జీలు, ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లు అన్నీ బుక్ అయి పోతాయి. బంధువులు, స్నేహితుల నివాసాలు కూడా ఇప్పుడు ముందుగానే డిమాండ్ పెరుగు తోంది. సంక్రాంతి రోజుల్లో ఇక్కడ వసతి కరువవుతోంది. హోటళ్ల యాజమాన్యాలు కూడా కొన్ని గదులను వ్యాపార ధోరణితో అధిక అద్దె కోసం రిజర్వు చేస్తున్నారు.పండగ దగ్గరికి వచ్చిన తర్వాత వాటికి ఉన్న డిమాండ్ బట్టి చార్జీలు వసూలు చేసుకుంటారు. పండుగ రోజుల్లో కనీసం 3 లక్షల మంది వరకు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది.. గతంలో ఉన్న అనుభవాల దృష్ట్యా ఈ అంచనా వేస్తున్నారు. ఇందులో సగం మంది బంధువులు స్నేహితులు కావడంతో వారికి వసతికి ఇబ్బంది లేదు. కోడిపందాలు చూసేందుకు , పాల్గొనడానికి కూడా వచ్చే వారి సంఖ్య లక్ష పైగా ఉంటుంది. వీరిలో చాలామంది తమ వాహనాల్లోనే మూడు రోజులు పాటు బస చేసే అలవాటు కొనసాగిస్తున్నారు. మిగిలిన జనానికి ఇప్పటికే బుక్ చేసుకున్న హోటళ్లు, లాడ్జిలు సరిపోవడం లేదు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి.. వీటికోసం అనేక సిఫార్సులు, ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరంతో పాటు ఉండి ,పాలకొల్లు, నర్సాపురం, ఆచంట, తణుకు, తాడే పల్లిగూడెం, ఉంగుటూరు, నిడదవోలు, కొవ్వూరు పరిసర ప్రాంతాలలో సంక్రాంతికి బంధుగణం పక్కన ఉంచితే అతిథులుగా వేలాదిగా చేరుకుంటారు. ఈ ప్రాంతాల్లో కోడిపందాల చూసేందుకు వచ్చేవారికి వసతి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈసారి భీమవరం ప్రాంతంలో విడిది గృహాల సంఖ్య పెరిగింది. ఒకటి రెండు లాడ్జిలు కూడా కొత్తగా ప్రారంభం అయ్యాయి.

జూదాలలో నకిలీ నోట్లు ?

కొన్నేళ్లుగా జూదాల్లో నకిలీ కరెన్సీ చలామణి జరుగుతోంది. ఇక్కడ జరిగే కోట్లాది రూపాయల పందాల్లో నకిలీ కరెన్సీ చేతులు మారుతోంది. సందట్లో సడేమియా అన్నట్టు మోసగాళ్ల కొందరు నకిలీ కరెన్సీని మారుస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సంక్రాంతి మూడు రోజులూ వెయ్యి కోట్ల వరకు చేతులు మారుతాయి. ఇంత పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినప్పుడు ఇటువంటి మోసాలు జరగడం రివాజుగా మారింది. "ఒరేయ్ నాకు దొంగ నోటు వచ్చిందిరా.." అంటూ బాధపడే వారి సంఖ్య కూడా కోడి పందాల బరుల్లో చెవిలో పడుతూనే ఉంటాయి. ఎవరేం చేయగలరు. పైగా ఇది పోలీసులకు చెప్పుకునేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి. పెద్ద నోట్లు రద్దుకు ముందు ఇటువంటి వ్యవహారాలు బాగా సాగేవి. తర్వాత తగ్గాయి. అయితే కొన్ని ఏళ్లగా మళ్లీ నకిలీ వ్యవహారాలు బయటపడుతున్నాయి.

సిండికేట్‌గా బరుల నిర్వహణ

గతేడాది పండుగ మొదటిరోజే అనుమతి
నష్టపోయామంటున్న నిర్వాహకులు


యలమంచిలి, జనవరి 5: సంక్రాంతి పండుగ మూడు రోజులూ గోదావరి జిల్లాల్లో పందేలకు తెరలేస్తుంది. కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. అప్పుచేసి అయినా ముందుగానే నగదు సిద్ధం చేసుకుంటారు. ఇదిలా ఉంటే కోడిపందేల బరుల నిర్వాహకులు సంక్రాంతి, కనుమ రోజుల్లో గుండాట, జూదం ఆడకుండా నిలిపివేయడంతో భారీగా నష్టపోయామని నిర్వాహకులు వాపోతున్నారు. ఈసారి పరిస్థితి ఉంటుందో తెలియదని అందుకే సిండికేట్‌గా బరిని నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. కొంతమంది నిర్వాహకులు మాత్రం ఈ ఏడాదైనా మూడురోజులు జూదానికి అనధికార అనుమతులు వస్తాయన్న ఆశతో సొంతంగానే బరులను ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



పట్టువీడని పోరు

సమ్మె వీడి విధుల్లో చేరాలని ప్రభుత్వం హెచ్చరించినా అంగన్‌వాడీలు తమ పట్టు వీడలేదు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆపేది లేదని తేల్చిచెప్పారు. శుక్రవారం జిల్లాలో వినూత్న నిరసనలతో ఆందోళన కొనసాగించారు. తణుకులో చీపుర్లతో రోడ్లు ఊడుస్తూ నిరసన తెలిపిన దృశ్యం ఇది.. - 8లో..

నాడు - నేడు నిధులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం, జనవరి 5 : పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి అధికారులు కష్టపడి పనిచేయాలన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఎన్నికలు, రీసర్వే, సమిత్వ, స్టోన్ ప్లాంటేషన్, ఈనాం భూములు, ఫ్రీహోల్డ్ భూముల్లో ఉన్న పెండింగ్ పనులపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలులో నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల రికార్డుల ప్రకారం పోలింగ్ కేంద్రాల పేర్లు నమోదు చేయాలని, ఆ పేరుతోనే పాఠశాల బోర్డు ఉండాలని ఆదేశించారు. ఈనెల 5 నుంచి 10 వరకు రీసర్వేకు సంబంధించిన గ్రీవెన్స్ నిర్వహిస్తామని, 17 నుంచి 21వ తేదీ వరకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. టెక్నికల్ సమస్యలు ఉన్న వాటిని రాష్ట్ర కార్యాలయానికి పంపాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్యడిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.



ఆచంట సభాస్థలి వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పితాని తనయుడు వెంకట్, హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, సభా ప్రాంగణంలో టీడీపీ, జనసేన జెండాల రెపరెపలు, ముదునూరులో నాయకులను కలసిన వలవల బాబ్జి

శరవేగంగా సభావేదిక పనులు

- తోరణాలతో సభాప్రాంగణం ముస్తాబు
- రెపరెపలాడుతున్న పసుపు జెండాలు

ఆచంట, జనవరి 5 : ఆచంటలో ఆదివారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగసభకు సభావేదిక ముస్తాబవుతోంది. ఆచంట-మార్టేరు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సభావేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సభా వేదిక చుట్టూ టీడీపీ జెండాలు, తోరణాలు కటట్టడంతో అంతా పసుపుమయంగా మారింది. సభావేదిక ద్వారం కూడా ముస్తాబుచేశారు. ఈ సభకు జిల్లా నుంచి లక్ష మంది జనం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నేతలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన చంద్రబాబు దిగే హెలీప్యాడ్ ప్రాంతం కూడా సిద్ధమైంది. తొలుత చంద్రబాబు హెలీప్యాడ్ నుంచి సభావేదిక వద్దకు ర్యాలీగా రానున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి ఆచంట వస్తున్న నేతలతో ఆచంట సందడి మారింది. సభావేదిక వద్ద మాజీ మంత్రి పితాని తనయుడు వెంకట్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఉప్పలపాటి సురేష్‌బాబు, గొడవర్తి శ్రీరాములు, గణపతిసీడి రాంబాబు, తమ్మినీడి ప్రసాద్, మీరయ్య, చిలుకూరి సీతారామ్ తదితరులు ఉన్నారు.





పెనుగొండ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని, నరసాపురం సమావేశంలో మాట్లాడుతున్న పొత్తూరి, కొవ్వలి తదితరులు

చంద్రబాబు సభ విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి పితాని

ఆచంట/పెనుగొండ, జనవరి 5 : 'రా కదలి రా' బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనం హాజరై విజయవంతం చేయాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆచంటలో సభాస్థలి వద్ద, పెనుగొండ మండలం పెనుగొండ టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆచంట సభలో ప్రజానికానికి చెబుతామన్నారు. ఆచంట మండం ఆచంట వీరవల్లివారి వీధిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని మాట్లాడుతూ చంద్రబాబు సభకు వేలాది మంది కార్యకర్తలను తరలి వచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు : ఆచంటలో నిర్వహించే 'రా కదలిరా సభ' ఎన్నికలకు పునాది అని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి, ఆచంట సభ పరిశీలకుడు బొడ్డు వెంకటరమణ సూచించారు. శుక్రవారం మొగల్తూరులో పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలంతా సుముఖంగా ఉన్నారన్నారు. నరసాపురం టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఆచంట సభకు మధ్యాహ్నం రెండు గంటలకు నరసాపురం పార్టీ కార్యాలయం నుంచి పది వేల మంది తరలివెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గుత్తుల సాయి, పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, సత్తినేని సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● యలమంచిలి : ఆచంటలో టీడీపీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. కాజ గ్రామంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత చంద్రబాబుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి తదితరులు పాల్గొన్నారు. ట

జగన్ పాలనలో విసుగెత్తిన ప్రజలు

- చంద్రబాబు సభకు తరలిరావాలని ఎమ్మెల్యే మంతెన పిలుపు



అబ్జర్వర్ బుచ్చిబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు/ఉండి, జనవరి 5: రాష్ట్ర ప్రజలు సైకో జగన్‌ను తరిమి కొట్టి చంద్రబాబును సీఎం చేయడానికి తహతహలాడుతున్నారని ఎమ్మెల్యే మంతెన రామరాజు, అబ్జర్వర్ బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం ఆకివీడు టీడీపీ కార్యాలయం, ఉండి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆదివారం జరిగే రా..కదలిరా సభ కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. ప్రతీ వ్యవస్థను జగన్ చిన్నాభిన్నంతో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. ఆకివీడులో పార్టీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, తిమ్మరాజు, నాగబాబు, గంధం ఉమా, తోట అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం : వలవల

పెంటపాడు, జనవరి 5 : ఆచంటలో ఆదివారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు సభను జయప్రదం చేద్దామని టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, నియోజకవర్గ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 90 బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కిలపర్తి వెంకట్రావు, గంధం సతీశ్, కాశీ నవీన్‌కుమార్, షేక్ సుభాన్, పాతూరి రాంప్రసాద్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక



జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు క్రీడాకారులు

దెందులూరు, జనవరి 5 :విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అట్లూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం పరిధిలోని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కాలేజీలో రాజమండ్రికి చెందిన జేఎన్‌టీయూ యూనివర్శిటీ పరిధిలోని ఐదు జిల్లాల్లోని కాలేజీలకు చెందిన సౌత్ జోన్ అంతర యూనివర్సిటీల జేఎన్‌టీయూ మహిళా హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కాలేజీ ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో 150 మంది పాల్గొనగా 16 మందితో జట్టును ఎంపిక చేశామన్నారు. వీరు ఈనెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు తమిళనాడులో జరిగే సౌత్ జోన్ యూనివర్సిటీల పోటీలకు రాజమండ్రి జేఎన్‌టీయూ జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఎంపికైనా క్రీడాకారులకు పలువురు అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- అండర్ -13,14,15 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మోషేన్‌రాజు

భీమవరంటౌన్, జనవరి 5 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని అందిస్తాయని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం అంగర విజయలక్ష్మి కన్నయ్య ఇండోర్ స్టేడియంలో శుక్రవారం అంగర కన్నయ్య మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అండర్-13,14,15 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అకాడమీ చీఫ్ కోచ్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులపాటు బాయ్స్, గర్ల్స్ సింగిల్, డబుల్స్ విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు లక్ష రూపాయల బహుమతులు అంది స్తామన్నారు. డీఎస్పీ శ్రీనాథ్, గాదిరాజు సుబ్బరాజు, ఇండియా కోచ్ మురళీకృష్ణ, జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శి మెంటే వంశీకృష్ణ, డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు 19

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 : ఏపీ ఓపెన్‌స్కూల్స్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజును ఈనెల 19 లోగా చెల్లించాలని డీఈవో శ్యాంసుందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 18 నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్స్ అధీకృత సెంటర్లనుగాని, ఏలూరు డీఈవో కార్యాలయంలోగాని సంప్రదించాలని సూచించారు.

31న ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సు

భీమవరం, జనవరి 5 : శాసన మండలిలో ఎమ్మెల్సీలు పాటించాల్సిన విధి, విధానాలపై భీమవరంలో ఈనెల 31న ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తెలిపారు. శుక్రవారం భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాశ్‌లతో కలిసి ఎమ్మెల్సీల సదస్సు నిర్వహణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ శాసనమండలి విధి, విధానాల్లో క్వశ్చన్ అవర్, షార్టు డిస్కషన్స్ సభలో సభ్యులు వ్యవహరించాల్సిన తీరు, అనుసరించవలసిన నిబంధనలు, తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎమ్మెల్సీలకు అవగాహన కల్పిస్తామన్నారు. భీమవరం బీవీరాజు కాలేజీలో నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ పీవీకే రామాచార్యులు, జాయింట్ సెక్రెటరీ విజయ రాజు, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, విశ్వనాథ్, పశ్చిమ గోదావరి డీఆర్వో బి.శివన్నారాయణ, భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు, మునిసిపల్ కమిషనర్ కె.శ్యామల పాల్గొన్నారు.

మహిళకు కొవిడ్ పాజిటివ్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 :ఏలూరు నగర పరిధిలో ఓ మహిళ (50)కు శుక్రవారం కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె హోం ఐసొలేషన్‌లో ఉన్నారని, ఆరోగ్యం స్థిరంగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల కొవిడ్ జేఎన్-1 వేరియంట్ నిర్ధారణ అయిన ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు పూర్తి ఆరోగ్యంతో కోలుకున్నారని వైద్యవర్గాలు తెలిపాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన కేసుతో కలుపుకుని జిల్లాలో ప్రస్తుతం ఐదు యాక్టివ్ కేసులున్నాయి.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎస్పీ మేరీప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 5 : పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీ యడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని ఆమె స్వీకరించారు. క్రీడలు ప్రారంభం సందర్భంగా క్రీడా జ్యోతిని ఆమె వెలిగించారు. ఆమె మాట్లాడుతూ 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్, హాకీ, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, ఫుట్‌బాల్, టెన్నీస్, షటిల్ మొదలగు క్రీడలు నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రంతో ఈ క్రీడలు ముగుస్తాయన్నారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ ఆదిప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, మహిళా ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు పట్టాలపై వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జనవరి 5 : ఏలూరు గన్‌బజార్ రైల్వే పట్టాల వద్ద ఒక వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్టు ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందింది. సిబ్బందితో శుక్రవారం వెళ్లి పరిశీలించగా ఏలూరు కొత్తపేటకు చెందిన కోనా కొండలరావు(74) ఏలూరులోని ఓ కంపెనీలో పదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈనెల 4వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి గన్‌బజార్ వద్ద రైలు పట్టాలుదాటుతూ అనారోగ్య కారణంతో పడి మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. గుండెపోటు వల్ల మరణించి ఉంటాడని భావిస్తున్నారు.

కోడిపుంజులు తస్కరించిన ఇద్దరిపై కేసు

ఆకివీడు, జనవరి 5: కోడిపుంజులు దొంగిలిస్తున్న ఇద్దరిని పట్టుకొని పోలీసుల ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు. దుంపగడపకు చెందిన జి.నాగరాజు నివాసంలో ఒక్కొక్కటి రూ.5వేలు విలువ చేసే రెండు పెంపుడు కోడిపుంజులను శుక్రవారం స్థానిక గుమ్ములూరు సెంటర్‌కు చెందిన కేతా సాయి, దుంపగడపకు చెందిన నవరపు చైతన్య దొంగిలిస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా దొంగకు రెండేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, జనవరి 5 : పగటి వేళ ఇంటి దొంగతనాలు చేస్తున్న ఒక మహిళా దొంగపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం భీమవరంలోని ముచ్చేవారితోటకు చెందిన పందిరి జ్యోతి(25) కొంతకాలం క్రితం ఏలూరులో ఉన్న పుష్పలీలానగర్‌కు వచ్చి అద్దెకు ఉంటుంది. ఆ ప్రాంతంలో పగటి వేళ ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకుని మారుతాళాలతో ఆ ఇంటి తాళాలు తీసి దొంగతనాలకు పాల్పడుతుంది. ఏలూరుటూటౌన్ పరిధిలో ఏడు నేరాలకు పాల్పడడంతో ఆమెను టూటౌన్ ఎస్ఐ నాగబాబు అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్లను దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో విచారణ సాగింది. నిందితురాలిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల కారాగార శిక్ష, ఒకొక్క కేసుకు రూ.పది వేల చొప్పున జరిమానాను మేజిస్ట్రేట్ వాసుదేవ్ విధించారు. ప్రాసి క్యూషన్ తరపున ఏపీ పీ జయశ్రీ వాదించగా ప్రాసిక్యూ షన్‌కు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకరరావు, కోర్టు హెచ్‌సీ సత్యనారా యణ, కానిస్టేబుల్ చిరంజీవి సహకరించారు.

లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ

- లక్ష రూపాయల హుండీ నగదు అపహరణ

ఏలూరు క్రైం, జనవరి 5 : ఏలూరు సమీపంలోని సత్రంపాడులో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దేవదాయధర్మదాయ శాఖ ఈవో సీహెచ్ చిననాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సత్రంపాడు లక్ష్మీగణపతి ఆలయంలో ఈనెల 4వ తేదీ రాత్రి యథావిధిగా తాళాలు వేశారు. 5వ తేదీ ఉదయం స్వీపర్ తుడవడానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఈ సమాచారం ఈవోకు తెలియడంతో ఈవో నాగేశ్వరరావు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఆ గుడిలోని హుండీ పగులగొట్టి లక్ష రూపాయలు నగదు అపహరించుకుపోయినట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం క్రైం, జనవరి 5 : భీమవరం గునుపూడికి చెందిన 23 ఏళ్ళ యువతి ఆచూకీ ఈనెల 4వ తేదీ నుంచి తెలియడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.హనుమంతరావు శుక్రవారం తెలిపారు.

సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 5: కొల్లేరు ఐదో కాంటూరు చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంత పరిధిలోకి వచ్చే తొమ్మిది మండలాల్లోని 89 గ్రామాల గురించి మండల కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలపై శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణకు తీసుకునే చర్యలపై సభ్యులకు వివరించారు. దీనికి సంబంధించి మౌలిక విషయాలను పరిధి ప్రతిపాదనలు సభ్యులకు తెలిపారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంతాన్ని గతంలో ఐదో కాంటూరు నుంచి ఒక కిలోమీటర్ పరిధిని ప్రతిపాదించారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ ప్రతిపాదనలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయోనని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, అటవీ, వన్యప్రాణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు జోగయ్య బహిరంగ లేఖ

పాలకొల్లు, జనవరి 5: సీఎం జగన్మోహన్‌రెడ్డి మరోసారి అధికారం చేపట్టటమే ధ్యేయంగా నవరత్నాల పేరుతో కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలపైనే ఆధార పడిన మాట వాస్తవం. 'సంక్షేమాన్ని సంక్షేమంతోనే కొట్టవలసి ఉంది. రాబో యే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగ ట్టడంతో పాటు జనసేన, తెలుగుదేశం ఉమ్మడి మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ముఖ్యంగా పేదరికంలో మగ్గుతున్న వారికి హామీలు ఇవ్వడం ద్వారా వారిని సంతృప్తి పరచటంతో విజయానికి దగ్గరపడడం ఎంత అవసరమో మీరు తెలుసుకో వాల్సి ఉంది' అంటూ రాష్ట్ర కాపు సంక్షేమ సేనా అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య శుక్రవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈలేఖను శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలో పత్రికా విలేకరులకు అందచేశారు.

పోస్టాఫీస్ ప్రహరీని ఢీకొట్టిన స్కూల్ బస్సు

- పిల్లలకు తప్పిన పెనుప్రమాదం



స్కూల్ బస్సు చుట్టూ స్థానికులు

ద్వారకాతిరుమల, జనవరి 5 : స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లోపించడం, డ్రైవర్ నిర్లక్ష్యం వెరసి స్థానిక న్యూకీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌బస్సు ఎత్తు నుంచి పల్లానికి దూసుకెళ్లి పోస్టాఫీసు గోడను ఢీకొట్టింది. బస్సులో ఉన్న స్కూల్‌పిల్లలు తీవ్రభయాందోళనలతో హాహాకారాలు చేశారు. వారికి ఏవిధమైన ప్రమాదం జరుగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని దొరసానిపాడు వద్ద ఈ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి ద్వారకాతిరుమలకు సుమారు 50 మంది పిల్లలతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులతో బస్సు బయలుదేరి స్థానిక పోస్టాఫీస్ వద్ద వేరే డ్రైవర్‌ను మార్చేందుకు టైరు కింద రాయి ఉంచి నిలుపుదల చేశాడు. మరో డ్రైవర్ బస్సు తీసేందుకు గాను టైరుకింద ఉంచిన రాయిని తొలగించాడు. ఎత్తు ప్రదేశంలో ఉన్న బస్సు ఒక్కసారిగా వెనక్కి వెళ్లి పోస్టల్ కార్యాలయ ప్రహరీని ఢీకొట్టింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు నోటీసుల జారీ నేటికి వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 5 : గత 17 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల ఆందోళనను అణచివేసేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం విధులకు హాజరుకాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులను జారీచేసే ప్రక్రియను శనివారానికి వాయిదా వేసింది. శుక్రవారం ఎస్ఎస్ఏ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నా సదర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చల్లో ప్రధాన డిమాండ్లలో ఒకటైన హెచ్ఆర్ పాలసీని అమలు చేయడానికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందనరాగా, మిగతా డిమాండ్లపై చర్చలు ఇంకా ఒక కొలిక్కిరాలేదని ఉద్యోగవర్గాలు వివరించాయి. ఇరుపక్షాల మధ్య సయోధ్యకు యత్నాలు జరుగుతుండడం వల్లే తొలుత అనుకున్నట్టుగా శుక్రవారం నోటీసులు జారీచేయలేక పోయామని, ఆమేరకు వేచిచూచే ధోరణిలో వున్నట్టు జిల్లా ఎస్ఎస్ఏ అధికారవర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం వరకు వేచి చూస్తామని, అప్పటికీ విధుల్లోకి హాజరుకాని ఉద్యోగులకు నోటీసులు జారీ చేస్తామని అధికారవర్గాలు వివరించాయి.

పోలవరంలో బుల్డోజర్ డ్రైవర్ మృతి

పోలవరం, జనవరి 5 : పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్‌ల నడుమ గురువారం సాయంత్రం ఇసుక లెవెల్ చేస్తున్న బుల్డోజర్ గోదావరి నది అగాథంలో పడిన దుర్ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. అతడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నడుమ బుల్డోజర్‌తో ఇసుక లెవెలింగ్ పనులను అమలాపురానికి చెందిన డ్రైవర్ జెల్లి నాగేశ్వరరావు(45) చేస్తున్నాడు. ఆ సమయంలో బుల్డోజర్‌తో సహా సుమారు 60 అడుగుల లోతు అగాథంలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు. ప్రాజెక్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గల్లంతైన నాగేశ్వరరావు మృతదేహాన్ని రెస్క్యూ టీం సభ్యులు గాలించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పోలవరం తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

నయనానందకరం.. ధనుర్మాస ఉత్సవం



దివ్యమూర్తుల ఊరేగింపు

ద్వారకాతిరుమల, జనవరి 5 : శ్రీవారి తిరువీధిసేవ శుక్రవారం ఉదయం క్షేత్రపురవీథుల్లో నయనానందకరంగా సాగింది. ఈ క్రమంలో స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి అట్టహాసంగా ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ప్రాంగణంలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ పురవీథుల్లో ఊరేగిం చారు. ప్రతీ ఇంటిముందు భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు.

చేబ్రోలులో దీన్‌దయాళ్ విగ్రహం ఆవిష్కరణ



దీన్‌దయాళ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన భారతి ప్రవీణ్‌పవార్, పురందేశ్వరి

ఉంగుటూరు, జనవరి 5 : చేబ్రోలులో బీజేపీ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ విగ్రహాన్ని కేంద్రవైద్య ఆరోగ్య శాఖ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ దీన్ దయాళ్ అంత్యోదయ సిద్ధాంతం ద్వారా పదవిలోకి వచ్చిన వారెవ్వరూ అహంకార పూరితంగా అధికారం చెలాయించవద్దని ఈ విషయాన్ని ప్రతి బీజేపీ కార్యకర్త గుర్తుంచుకోవాల న్నారు. ముఖ్యఅతిథి కేంద్ర వైద్యఆరోగ్య శాఖ మాట్లాడుతూ దీన్ దయాళ్ సమాజంలోని అణగారిన ప్రజలను ఉద్ధరించే దిశగా అనేక కార్యక్రమాలను రూపొందించారన్నారు. రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిషోర్, ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, సర్పంచి రాంధే లక్ష్మీసునీత, కృష్ణ ప్రసాద్, పెన్మత్స రామచంద్రరాజు తదితరులు ఆపాల్గొన్నారు.

లేసు పార్కు అభివృద్ధికి సాయం అందిస్తాం



లేసు అల్లికలను పరిశీలిస్తున్న సీఈవో వినోద్‌కుమార్

నరసాపురం రూరల్, జనవరి 5: లేసు పార్కు అభివృద్ధికి సంస్థ తరఫున చేయాల్సిన ఆర్థిక సాయం అందిస్తామని ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో వి.వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. సీతారాంపురం లేసు పార్కును శుక్రవారం ఆయన పరిశీలించారు. పీఎం విశ్వకర్మ ద్వారా జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఎంతమంది నేర్చుకుంటున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం పలు రిజిస్టర్లు, లేసు అల్లికలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేసు పార్కులో జరిగే కార్యక్రమాలను యూనివర్స్ యాప్‌లో రిజిస్టర్ చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసులు, డీఎస్‌డీవోపీ కృష్ణారెడ్డి, లేసుపార్కు సీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'డిపాజిట్‌దారులందరికీ న్యాయం చేస్తాం'



డిపాజిట్‌దారులతో మాట్లాడుతున్న డీఆర్ రవికుమార్

టి.నరసాపురం, జనవరి 5 : టి.నరసాపురం సొసైటీలో డిపాజిట్ దారులందరికి రెండు మూడు నెలల్లో న్యాయం చేస్తామని కో-ఆపరేటివ్ డివిజనల్ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్ తెలిపారు. స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపాజిట్‌దారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బాధ్యులకు చెందిన ఆస్తులను జప్తు చేశామని, డిక్రీ పొందిన అనంతరం వాటిని వేలం ద్వారా విక్రయించిన నగదుతో పాటు రైతులు రుణాలు పొంది కాలం గడిచినా చెల్లించని నగదు వసూలు చేసి, డిపాజిట్‌దారులకు చెల్లిస్తామన్నారు. దీనికోసం పీఏసీఎస్ సిబ్బందిని రైతులు నుంచి రుణాలు వసూలు చేసేందుకు నియమించామని తెలిపారు. సమావేశంలో డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి మోహన్ బాబు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు, జనవరి 5: అక్రమ మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. స్థానిక సిద్ధాపురం రోడ్‌లో మద్యం అమ్ము తున్న సత్యనారాయణను శుక్రవారం అదుపులోకి తీసుకుని 180 ఎంఎల్ 37 సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు అతడిని రిమాండ్‌కు భీమవరం తరలించామని ఎస్ఐ తెలిపారు.

లబ్ధిదారులకు నగదు జమ

భీమవరం, జనవరి 5 : జిల్లాలో పలు పథకాల కింద 2439 మందికి రూ.3.78 కోట్ల నగదును శుక్రవారం లబ్ధిదారులకు మంజూరు చేసినట్టు కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. పలు పథకాలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరు ప్రశాంతి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, అధికారులు తిలకించారు. ఈబీసీ నేస్తం, అమ్మఒడి, చేదోడు, కల్యాణ మస్తు, షాదీ తోఫా, కాపునేస్తం, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, వాహనమిత్ర తదితర పథకాల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లాకు సంబంధించి 2439 మందికి వివిధ పథకాల లబ్ధిదారులకు రూ.3.78 కోట్లు విలువైన నమూనా చెక్కును కలెక్టరు లబ్ధిదారులకు అందజేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి

భీమవరం, జనవరి 5: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జేసీ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా అధికారులు, వినియోగదారులు, విద్యార్థులు, తదితరులతో జేసీ సమావేశం నిర్వహించారు. అన్ని రంగాల్లో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయని, నాణ్యత విషయంలో లోపాలు ఉంటే సామాన్యమైన వ్యక్తి కూడా ప్రశ్నించే స్థాయిలో ఉన్నప్పుడే సమస్యలు తెలుస్తాయని అప్పుడే పరిష్కారంకు మార్గం ఏర్పడుతుందన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను జేసీ అందజేశారు.

ముగిసిన భక్తాంజనేయ స్వామి ఉత్సవాలు



వీరవాసరం, జనవరి 5: నందమూరుగరువు రామభక్తాంజనేయస్వామి హనుమద్వ్రత మహోత్సవాలు ముగిశాయి. గత నెల 24న ప్రారంభమైన మహోత్సవాలు శుక్రవారంతో 13 రోజులపాటు సాగాయి. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొప్పినీడి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మేకల వెంకట చలపతిరావు, కావలి దామోదరరావు, పులగం గున్నయ్య, వడ్డి కనకదుర్గాప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.





వీరవాసరంలో బొట్టు పెట్టి అక్షింతలు అందిస్తున్న మహిళలు.. (ఇన్‌సెట్‌లో) భీమవరంలో మాజీ ఎమ్మెల్యే రామాంజనేయులుకు అక్షింతలు అందిస్తున్న దృశ్యం

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ

వీరవాసరం, జనవరి 5: అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలను శుక్రవారం నేలపోగుల గ్రామంలో పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కంది అప్పారావు ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు.

భీమవరం టౌన్/తణుకు: అయోధ్యలో బాలరాముడికి పూజించిన అక్షింతలు ఇంటింటికీ 1,116 ప్యాకెట్లు అందజేశారు. శ్రీఅన్నమాచార్య కీర్తన గ్రూపు సభ్యులు, రామ సేవకులు శుక్రవారం బ్యాంక్ కాలనీలో పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామంజనేయులు తదితర ప్రముఖులకు అందించారు. తణుకు సజ్జాపురం రామాలయం నుంచి అక్షింతలు ప్యాకింగ్ చేసి ఊరేగింపుగా తీసుకెళ్ళి ఇంటింటికీ పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అవినాష్ కాంత్, ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం కలిసే ప్రయాణిస్తాం....



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ , జనసేన నాయకులు

వీరవాసరం, జనవరి 5: రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసే ప్రయాణం చేస్తామని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని (టీడీపీ), జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు (జనసేన) తదితర ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం వీరవాసరం వెలమపేటలో టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మేనిఫెస్టోతో ఉన్న జనంలోకి జనసేన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, జవ్వాది బాలాజీ, యరకరాజు గోపాలకృష్ణంరాజు, వీరవల్లి శ్రీనివాసరావు, కవురు భాస్కరావు, గుల్లిపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యాన శిక్షణ

వీరవాసరం, జనవరి 5: జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ధ్యాన శిక్షణ ఇచ్చారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీరోజు రెండుసార్లు ధ్యానం చేయాలని, ఇంటి వద్ద ధ్యానం ఎలా చేయాలో తెలియచేశారు. విద్యార్థులతో సామూహిక ధ్యానం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొనసాగిన న్యాయవాదుల నిరసన

నరసాపురం టౌన్, జనవరి 5: ఏపీ భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ శుక్రవారం న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, గుమస్తాలు విధులు బహిష్కరించి కొద్దిసేపు కోర్టు గేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈచట్టం అమల్లోకి వస్తే చట్టబద్ధమైన భూమి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు.

బెస్ట్ ప్లేయర్స్ ఎంపిక

నరసాపురం టౌన్, జనవరి 5: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయికి 1710 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కమిషనర్ వెంకటేశ్వరావు చెప్పారు. శుక్రవారం వైఎన్ కళాశాల మైదానంలో ముగింపు కార్యక్రమానికి చైర్‌పర్సన్ వెంకటరమణ విచ్చేశారు. పట్టణంలోని 15 సచివాలయాల పరిధిలో 307టీమ్‌లు, 173 మ్యాచ్‌లు, 3070 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతి సచివాలయం నుంచి బెస్ట్ ప్లేయర్స్‌ను ఎంపిక చేసి మండల స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

భీమవరం టౌన్, జనవరి 5 : దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని, ఓటు విలువ నేటి యువత తెలుసుకుని సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాలని కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాఘవ అన్నారు. కళాశాలలో ఓటు విలువ - ఓటు చైతన్యం అనే నినాదంతో ర్యాలీ ప్రతిజ్ఞ నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి ఓటు హక్కు ప్రతిజ్ఞ నిర్వహించారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

ఉండి, జనవరి 5: అర్హులందరికీ కేంద్రప్రభుత్వ పథకాలు అందుతాయని ఇన్‌చార్జి ఎంపీడీవో కొండలరావు అన్నారు. శుక్రవారం ఉప్పులూరు, ఉణుదుర్రు గ్రామాలలో వికసిత భారత్ సంకల్పయాత్ర గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో కొండలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న ఆయా పథకాలన్నింటిని వివరించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు యర్రా దుర్గారావు, పిన్నంరాజు సుబ్బలక్ష్మీ, ఉండి అసెంబ్లీ కన్వీనరు కోరా రామూర్తినాయుడు, కో-కన్వీనరు గాదిరాజు వెంకటేశ్వరరాజు, పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ర్యాలీ

సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల డిమాండ్

వామపక్షాలు, టీడీపీ నాయకుల మద్దతు



నరసాపురంలో ఆందోళన చేస్తున్న కార్మికులు





తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులు



భీమవరంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు... పాలకొల్లులో మునిసిపల్ కార్మికులకు ఎమ్మెల్యే నిమ్మల మద్దతు

నరసాపురం టౌన్, జనవరి 5: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి శివాలయం, మెయిన్‌రోడ్, అంబేడ్కర్, మొగల్తూరు రోడ్లలో ప్రదర్శన చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఏఐటీయూ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు.

భీమవరం టౌన్/అర్బన్: భీమవరంలో మునిసిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు కూడళ్ళలో సమ్మె ఎందుకు చేయవలసి వచ్చిందో ప్రజలకు తెలియజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ అధికారులు ద్వారా సమ్మె విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అయితే కార్మికులు పోటీ చర్యలను ఐక్యంగా తిప్పికొడతారన్నారు. ఈ ధర్నాలో జేఏసీ నాయకులు జి.నాని, నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, నీలాపు విశ్వనాథం, నిమ్మకాయల ధనలక్ష్మి పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కిల్లరి మల్లేశ్వరరావు, చల్లబోయిన రంగారావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు జీవో 151 అమలు చేసి కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సత్యనారాయణ, నీలపు శ్రీనివాసు, రమణరావు, దుర్గారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మునిసిపల్ కార్మికులు తాడేపల్లిగూడెంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్, ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు., వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు తాడికొండ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద 11వ రోజు సమ్మెలో మునిసిపల్ కార్మికులు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. యూనియన్ నాయకుడు నీలపు ఆదినారాయణ, సీఐటీయూ మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు రమేష్, రామకృష్ణ మద్దతు తెలిపారు. పట్టణంలో మునిసిపల్ కార్మికులు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. సమ్మెకు తణుకు శాఖ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు.

పాలకొల్లు టౌన్: మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. పాలకొల్లు పురపాలక సంఘ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం మూడు రోజులుగా చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నిమ్మల సందర్శించి సంఘీభావం తెలిపారు. పారిశుధ్య కార్మికుల కోర్కెలను జగన్ ప్రభుత్వం తీర్చకపోతే మరో మూడు నెలల్లో అధికారంలోకి రాబోయే టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.







పెంటపాడులో అంగన్‌వాడీల దీక్షలు... కాళ్ళలో కాంగ్రెస్ నాయకుల సంఘీభావం.. పాలకోడేరులో ఒంటి కాలిపై నిలబడి దండం పెడుతూ వేడుకుంటున్న అంగన్‌వాడీలు

ఒంటి కాలిపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

ఆకివీడు/కాళ్ళ/పాలకోడేరు/భీమవరం అర్బన్/ఆచంట/తణుకు/పెంటపాడు//////////, జనవరి 5: సీఎం జగన్ ఇచ్చిన హామీలు, సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని ఆందోళనలు చేస్తుంటే కలెక్టర్లు ఉద్యోగాలు పోతాయని బెదిరించడం తగదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీరాణి అన్నారు. అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం ఆకివీడు గాంధీజీ సెంటర్‌లో 25వ రోజు సమ్మెలో భాగంగా ఒంటికాలపై నిల్చొని నిరసన తెలిపారు. కాళ్ళ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 25 రోజుకు చేరుకున్నాయి. వీరికి కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి గోపాలకృష్ణంరాజు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఒంటి కాలుపై నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. పాలకోడేరులో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. తణుకులో అంగన్‌వాడీలు చీపుళ్లతో మెయిన్ రోడ్డు తుడుస్తూ నిరసన తెలిపారు. పెంటపాడులో అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ సందర్శించారు. సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, జె. శ్యామల కుమారి, ఆర్.అనూరాధ, కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భీమవరం, ఆచంటలలో సమ్మె కొనసాగింది.





ఆచంట, భీమవరంలలో అంగన్‌వాడీల దీక్షలు

అంగన్‌వాడీల సమ్మెను ఉధృతం చేస్తాం

భీమవరం అర్బన్, జనవరి 5 : అంగన్వాడీల సమ్మెను ఉధృతం చేస్తామని యునియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణీ అన్నారు. శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో అంగన్వాడీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం కోసం ఈ నిరాహారదీక్షలు చేపడుతున్నామన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం అర్బన్, జనవరి 5: స్వేచ్ఛ మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం కిట్లు, దుప్పట్లను వన్ టౌన్ ఎస్ఐ హనుమంతరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలు ఆకుల సతీష్, విశ్రాంత జడ్జి బొమ్మిడి అప్పారావు సహకారం అందించారు.

30, 31 తేదీల్లో కల్లుగీత కార్మిక మహా సభలు

తణుకు. జనవరి 5: కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 30, 31 తేదీల్లో తణుకులో నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి తెలిపారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో మహాసభల ఆహ్వాన కమిటీ సమావేశం నిర్వహించి పలువురిని కమిటీ సభ్యులుగా నియమించారు. గీత కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎర్ర దేవుడు, కేతా గోపాల్, పీవీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మిలిటరీ మాజీ ఉద్యోగి మృతికి సంతాపం



పెనుమంట్ర జనవరి 5: మాజీ మిలటరీ ఉద్యోగి, బీఎస్ఎన్ఎల్ టెక్నీషియన్, ఎం. సాంబమూర్తి (80) ఆకస్మిక మృతి పట్ల దళిత ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఇంటి వద్ద అనారోగ్యంతో మృతి చెందారు. దళిత ఉద్యోగ సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విక్టర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బీజేఐ రాజు, నేలపూడి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ సుకుమార్, బండి ప్రసాద్, బండి వెంకటేశ్వర రావు సంతాపం తెలిపారు.

విజయవాడ తరలిన భోజన పథకం కార్మికులు

పెనుమంట్ర, జనవరి 5: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు విజయవాడకు తరలివెళ్ళారు. తమ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వానికి తెలియపరచడం గురించి పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ 10వేల రూపాయలు జీతం పెంచాలని, జాబ్ కార్డులు ఇవ్వాలని మెనూ చార్జీలు పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు.

బీమా చెక్కులు అందజేత

భీమవరం రూరల్, జనవరి 5 : ప్రతీ కుటుంబానికి వైఎస్ఆర్ బీమాతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భద్రత కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన చెబ్రోలు నాగేశ్వరరావు, 39వ వార్డుకు చెందిన మానేపల్లి తాతారావులు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెరో ఐదు లక్షల రూపాయల నగదును ఆయన చేతుల మీదుగా అందించారు.

ఎమ్మెల్యే గ్రంధిని కలిసిన ఏఎస్పీ

భీమవరం రూరల్, జనవరి 5 : పశ్చిమ గోదావరి జిల్లాకు నూతనంగా నియమితులైన పోలీస్‌శాఖ ఏఎస్పీ బి.భీమారావు శుక్రవారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను అభినందించిన గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

పాలకోడేరు, జనవరి 5 : ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గొల్లలకోడేరు గ్రామానికి చెందిన రాగన నాగలక్ష్మికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి గొల్లలకోడేరులో చోటు చేసుకుంది. అత్తిలి మండలం వడలి గ్రామానికి చెందిన రాగన నాగలక్ష్మి కుటుంబంతో కలిసి గొల్లలకోడేరులోని 10వ వార్డులో అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం రాత్రి భార్యభర్తలు బైక్‌పై బజారుకు వెళ్తుండగా అదే సమయంలో తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టి వెనుక కూర్చొన్న మహిళ కాలుపై నుంచి బస్సు చక్రం వెళ్ళడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

మొగల్తూరు, జనవరి 5: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలందించేందుకే ప్రభుత్వం సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తున్నామన్నారు.

8 నుంచి అప్రంటీస్ షిప్ మేళా

ఉండి, జనవరి 5 :ఈనెల 8వ తేదీ ఉదయం 10గంటల నుంచి ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రంటీస్‌షిప్ మేళ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. ఈమేరకు శుక్రవారం పత్రికలకు వివరాలను అందించారు. జిల్లాకు చెందిన వివిధ ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో పనిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉండిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో తమ సర్టిఫికెట్సుతో నేరుగా హాజరు కావలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 96760 99988 లేదా 88863 39666 నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

కృష్ణయ్యపై టీడీపీ బీసీ నాయకుల ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాలకొల్లు టౌన్, జనవరి 5: బీసీలను వైసీపీకి తాకట్టు పెట్టి రాజ్యసభ సభ్యత్వం తీసుకున్న నీవా బీసీ సంక్షేమం గురించి మాట్లాడేది అంటూ ఆర్.కృష్ణయ్యపై రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ సంక్షేమం అద్భుతంగా ఉందని ఆర్.కృష్ణయ్య ప్రకటించడంపై ఆయన తప్పుబట్టారు. బీసీ ఉద్యమనేతగా ఉన్న కృష్ణయ్య తెలంగాణ సీఎం అభ్యర్థిగా టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రకటనతోనే రాజకీయంగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. గులాంగిరి నుంచి బయటకు వచ్చి ఆత్మగౌరవంతో ఎలా బతకాలో మహాత్మా జ్యోతిరావు పూలే నేర్పించారని, కానీ ఆర్.కృష్ణయ్య మళ్లీ తన వ్యాఖ్యలతో గులాంగిరిని గుర్తు చేస్తున్నారని శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. కులానికో బీసీ కార్పొరేషన్ పెట్టి ఒక్క రూపాయి కూడా విదల్చని జగన్మోహన్‌రెడ్డి భజన చేస్తున్న కృష్ణయ్యకు బీసీ సంక్షేమ సంఘం పేరు చెప్పుకునే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల కోటేశ్వరరావు, టీడీపీ జోన్-2 మీడియా కో-ఆర్డినేటర్ గుడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు: మంత్రి కారుమూరి

అత్తిలి, జనవరి 5: అర్హులందరికీ పథకాలను వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి అందిస్తున్నామని మంత్రి కారుమూరి అన్నారు. తణుకు నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన ప్రజాదీవెన యాత్ర 4వ రోజుకు చేరింది. అత్తిలి మండలం ఆరవల్లి, దంతుపల్లి, కంచుమర్రు గ్రామాల్లో సాగింది. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న వైసీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆరవల్లిలో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకును, ఎస్సీ ఏరియాలో రేలంగి కాలువ వద్ద రేవును మంత్రి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, వెలగల అమ్మిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ నేత సాంబమూర్తి విగ్రహావిష్కరణ

భీమవరం రూరల్, జనవరి 5 : తీరప్రాంత భూపోరాట యోధుడు, సీపీఐ నేత నాగిడి సాంబమూర్తి విగ్రహావిష్కరణను ఈనెల 6వ తేదీ ఉదయం 10:30 గంటలకు నాగిడిపాలెంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవిష్కరించనున్నారని సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి కోనాల భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తి విగ్రహావిష్కరణకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, శాసనమండలి చైర్మన్ కొయ్యేమోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కమ్యూనిస్టు నాయకులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.



నోటు పుస్తకాలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

పాఠశాలకు పుస్తకాల పంపిణీ

భీమవరం రూరల్, జనవరి 5 : రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రజలు, అభిమానులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున నోటు పుస్తకాలను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శాసనమండలి చైర్మన్ కోరిక మేరకు శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ ప్రశాంతి శాసనమండలి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో పీఎస్ఎం గరల్స్ బాలికోన్నత పాఠశాలకు రెండు వేల పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాశ్, రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు, డీఆర్వో బి.శివన్నారాయణ, ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.



సంతోష్‌కు నియామక పత్రం అందిస్తున్న తోట సీతారామలక్ష్మి

బ్రాహ్మణ సాధికార జిల్లా కన్వీనర్‌గా సంతోష్

భీమవరం టౌన్, జనవరి 5 : టీడీపీ జిల్లా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్‌గా పట్టణానికి చెందిన చెరకుపల్లి సంతోష్‌ను నియమించినట్లు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.అచ్చంనాయుడు జారీ చేసిన నియామక ఉత్తరులను సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, బ్రాహ్మణ సాధికార కమిటీ నాయకులు వేలూరి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లతాంగి సిస్టర్స్ గాత్ర కచేరీ

భీమవరంటౌన్, జనవరి 5 : త్యాగరాజ స్వామి 105వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్యాగరాజ భవనంలో నిర్వహించిన లతాంగి సిస్టర్స్ (చెన్నై) గాత్రకచేరీ సంగీత శ్రోతలను ఆకట్టుకున్నది. మూడు గంటల పాటు త్యాగరాజస్వామి, ముత్తుస్వామిదీక్షితార్, తరంగాలు, అన్నమాచార్య కీర్తనలతో రంజిపజేశారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

అత్తిలి, జనవరి 5: కేంద్రం ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు ప్రజలు సద్వినియోం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. అత్తిలిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, తోట త్రిమూర్తులు, అయినంపూడి శ్రీదేవి, బాలం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.